క్లుప్తంగా

మెనూ అమలులో నిర్లక్ష్యం చేయొద్దు



రామన్నపాలెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో మెనూ పరిశీలిస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని ఎంపీడీవో జాగరపు రాంబాబు తెలిపారు. ఆయన మంగళవారం సరుగుడు పంచాయతీ శివారు అచ్చంపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి చిన్నారులతో ముచ్చటించారు. రామన్నపాలెం పాఠశాలలో భోజనం రుచి చూశారు. సరుగుడు సచివాలయాన్ని సందర్శించి సిబ్బందితో సమావేశమయ్యారు. పంచాయతీ కార్యదర్శి చినబాబు పాల్గొన్నారు.

డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మహాలక్ష్మినాయుడు

రావికమతం: ప్రపంచ డౌన్ సిండ్రోమ్ వ్యాధి దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక భవిత కార్యాలయంలో ఆ వ్యాధిపై దివ్యాంగ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, జగన్నాథనాయుడు మాట్లాడుతూ ఇది జన్యు సంబంధిత వ్యాధి అని, శారీరక, మానసిక ఎదుగుదల సరిగా ఉండదన్నారు. మేనరిక వివాహాలు మానుకోవాలన్నారు. ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, అప్పలనాయుడు, బాలరాజు పలు సూచనలు చేశారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

దేవరాపల్లి: కాశీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంధన వనరుల సంరక్షణ వారోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంధన వనరుల ప్రాధాన్యతను తెలిపే పోస్టర్లను ప్రదర్శించి, వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను హెచ్‌ఎం సుజాత వివరించారు. అనంతరం ఇంధన వనరుల ఆవశ్యకతపై విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన, క్విజ్ పోటీలను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు రామలక్ష్మి, పూర్ణిమ, మాధవి, రాము, రాంబాబు పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కరిస్తాం

నాతవరం: ఎన్నికలు కమిషనర్ అనుమతితోనే సబ్ స్టేషన్‌లో అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని జేఈ చంద్రమౌళి తెలిపారు. కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసే స్థలాన్ని మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాతవరంలో పెరిగిన వినియోగదారులకు పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా అందించాలంటే కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలన్నారు. రూ.1.20 కోట్లతో ఏర్పాటు చేసేందుకు ప్రత్యేకంగా సిమెంటు దిమ్మ నిర్మాణం చేయాలన్నారు. ఎన్నికలు కోడ్ అమలు నాటి నుంచి రైతులకు వ్యవసాయ కనెక్షన్లు కొత్త పనులు నిలుపుదల చేశామన్నారు.

వైఎస్సార్‌సీపీదే అధికారం

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తనయుడు సూర్య



కోలాటం తిలకిస్తున్న ధర్మశ్రీ తనయుడు సూర్య

రోలుగుంట: ఎన్ని పార్టీలు కలిసినా సీఎం జగన్మోహన్‌రెడ్డి నవరత్నాలే పార్టీ విజయానికి శ్రీరామరక్షగా నిలుస్తాయని, మరోసారి అధికారంలోకి రావడం తథ్యమని ప్రభుత్వం విప్ కరణం ధర్మశ్రీ తనయుడు సూర్య ధీమా వ్యక్తం చేశారు. పాపంపేటలో ముత్యాలమ్మ పండగకు మంగళవారం ఆయన హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ మండల యువజన శాఖ అధ్యక్షుడు దోసపత్నిరాజుతో కలిసి కాసేపు మహిళల కోలాటం వీక్షించారు. అనంతరం గ్రామ పెద్దలను కలిశారు. ఎమ్మెల్యే బరిలో నిలిచిన తన తండ్రి ధర్మశ్రీని గత ఎన్నికల మాదిరిగానే భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. సంక్షేమ పథకాలను ప్రచారం చేయాల్సిన బాధ్యత పార్టీ నాయకులు తీసుకోవాలని కోరారు.

406 మందికి వైద్య పరీక్షలు

రావికమతం: ఆరోగ్య సురక్ష–2 శిబిరంలో భాగంగా మంగళవారం జెడ్.కొత్తపట్నంలో 406 మంది రోగులను వైద్యులు పరీక్షించారు. అప్తాలమిస్టు డాక్టర్ హిమబిందు, ఆర్థోపెడిక్ డాక్టర్ చరణ్‌కుమార్, కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారి సురేఖ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కొత్తకోట పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి పాతాళ రామారావు పాల్గొన్నారు.

పేదలకు పూర్తి మేలు చేశాం

- నర్సీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి గణేష్
- సిహెచ్.నాగాపురంలో ఘన స్వాగతం
- టీడీపీ నుంచి పలువురు వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే గణేష్‌కు ఘన స్వాగతం పలుకుతున్న ప్రజలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్



పార్టీలో చేసిన వారితో నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలకు పూర్తి న్యాయం చేశామని, అభివృద్ధి, సంక్షేమంతో ఈ రోజు గ్రామాలు కళకళలాడుతున్నాయని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం సిహెచ్. నాగాపురంలో పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున హారతులతో ఘన స్వాగతం పలికారు. మండలంలో తొలిసారిగా ఎన్నికల ప్రచారం ఇక్కడ ప్రారంభించడంతో గ్రామస్తులతోపాటు మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు. ముందుగా అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ప్రతీ ఇంటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అర్హతే కొలమానంగా పార్టీలు చూడకుండా ప్రభుత్వ పథకాలు అందించామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేశామన్నారు. ఇటువంటి సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌కు సంపూర్ణ మద్దతు పలకాలని కోరారు. ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చి ప్రజల్లోకి వచ్చామన్నారు. తమ పాలనలో గ్రామాల్లో ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు. నాగాపురం శివారు కుమారుపురం గ్రామంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. తమ గ్రామం వైఎస్సార్‌సీపీకే మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ యార్డు చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, జెడ్పీటీసీ సుర్ల వెంకట గిరిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ జక్కు నాగమణి, సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు, నాయకులు గంట్ల బుచ్చిబాబు, యర్రా శ్రీను, బుజ్జి, దివానం, బాబులు, రాయవరపు రాము, జైతు అప్పారావు, జుర్రావ లోవకుమార్, జైతు నర్సకుమారి, మండల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన టీడీపీ

ప్రజలను నిలువునా మోసం చేసేది తెలుగుదేశం పార్టీనేనని నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ తెలిపారు. 2014లో ఎన్నికల హామీలిచ్చి ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదని విమర్శించారు. రైతు, డ్వాక్రా రుణాల మాఫీ పేరిట మోసం చేశారని ఆరోపించారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా మోసిన టీడీపీని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ ఇచ్చిన ప్రతీ హామీని 99 శాతం నెరవేర్చి ప్రజల్లో రావడంతోనే ఎంతో ఆనందంగా గౌరవిస్తున్నారని తెలిపారు. దగాకోరు పార్టీ టీడీపీకి ఓటు వేయొద్దని కోరారు.

11 కుటుంబాలు పార్టీలో చేరిక

నాగాపురం పంచాయతీలో టీడీపీ నుంచే కాకుండా స్వచ్ఛందంగా 11 కుటుంబాల వారు ఎమ్మెల్యే గణేష్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కూనిశెట్టి వెంకట రమణ, వడ్డాది నాగభూషణం, అప్పన వరహాలబాబు, అప్పన జోగారావు, వాసం చంద్రయ్య, గురిబిల్లి సాంబమూర్తి, గురిబిల్లి వరహాలు, విప్పల దేవత, దేవుడమ్మ, జైతు రాణి, దాక్షారపు ఝాన్సీ, వేమగిరి చిలకమ్మతోపాటు పలువురు చేరారు. ఇందులో టీడీపీ సానుభూతిపరులైన ఏడు కుటుంబాలు ఉన్నాయి.

గురందొరపాలెంలో టీడీపీకి షాక్

- వైఎస్సార్‌సీపీలో చేరిన 15 కుటుంబాలు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: గురందొరపాలెంలో టీడీపీకి షాక్ తగిలింది. ఈ గ్రామంలోని టీడీపీకి చెందిన 15 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. పెదబొడ్డేపల్లి లోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి అందరూ సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గురందొరపాలెం సర్పంచ్ శానాపతి వెంకటరత్నం పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి



మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ నూకరాజు

రోలుగుంట: గ్రామాల్లో ఎన్నికల నియమావళిని విధిగా అమలు చేయాలని ఈవోపీఆర్డీ ఎస్.నూకరాజు తెలిపారు. తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. కోడ్ అమలులో ఉన్నందున ఎక్కడా రాజకీయ పార్టీల జెండాలు కనిపించకూడదన్నారు. ఇళ్లపై రాజకీయ పార్టీ జెండా ఉంటే అనుమతి తీసుకోవాలన్నారు. ఇంటి పన్నులు వసూలు వేగవంతం చేయాలన్నారు. వేసవి దృష్ట్యా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రశాంత ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

గన్నవరం చెక్‌పోస్టును తనిఖీ చేసిన నర్సీపట్నం ఆర్డీవో జయరాం



చెక్‌పోస్టు వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న నర్సీపట్నం ఆర్డీవో జయరాం

నాతవరం: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వీ జయరాం అన్నారు. జిల్లా సరిహద్దులో గన్నవరం మెట్ట వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టు సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంకితభావంతో పని చేయాలన్నారు. అనుమతులు లేకుండా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించిన కేసులు నమోదు చేస్తామన్నారు. నాలుగు మండలాల్లో సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తించామన్నారు. మద్యం, డబ్బులు పంపిణీపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. అందుకోసం ప్రత్యేకంగా తనిఖీ బృందాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్, ఆర్ఐ హరి, గన్నవరం వీఆర్వో భూపతిరాజుగణేష్, చెక్‌పోస్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం



మానవహారంగా ఏర్పడ్డ మహిళలు

రావికమతం: ఓటు వజ్రాయుధం వంటిది, ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి, ఎటువంటి ప్రలోభాలకు తావివ్వరాదంటూ మహిళలు, ఆర్బీకే కేంద్ర ఉద్యోగులు, వెలుగు, మండల పరిషత్ సిబ్బంది మంగళవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక హైస్కూల్ ఆవరణలో మానవహారంగా ఏర్పడ్డారు. స్వీప్ 2024 –ఓటర్లకు అవగాహనలో భాగంగా జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో భానోజీరావు, ఏవో రూప, వెలుగు ఏపీఎం తిలక్ పాల్గొని ఓటు విలువను వివరించారు.

భవనం సమకూర్చాలని ఆర్డీవోకు వినతి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగులు

మాకవరపాలెం: పునరావాస కేంద్రం సమకూర్చాలని ఆర్డీవో జయరాంకు దివ్యాంగులు మంగళవారం వినతిపత్రం అందించారు. మండలంలో దివ్యాంగుల మ్యూచ్‌వల్ కోఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా దివ్యాంగులకు వసతి కల్పనకు భవనాన్ని సమకూర్చాలని సొసైటీ చైర్మన్ తమరాన సతీష్, వైస్ చైర్మన్ సత్యమోహనగోపి కోరారు. శాశ్వత పునరావాస కేంద్రం కేటాయిస్తే, అక్కడే ఉపాధి పొందేలా ఏర్పాట్లు చేసుకుంటామన్నారు.

ఘనంగా మోదమాంబ ఒడ్డు పండగ



అమ్మవారి ఘటాలతో ఎంపీపీ రాజారామ్, డిప్యూటీ సీఎం బూడి సతీమణి రమణమ్మ

మాడుగుల: స్థానిక మోదమాంబ కాలనీ వాసులు మోదమాంబకు 500 ఘటాలతో మంగళవారం ఒడ్డు పండగ నిర్వహించారు. కాలనీలో మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మతోపాటు ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, సర్పంచ్ యడ్ల కళావతి, ఎంపీటీసీ కుక్కర మహేశ్వరి, పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొత్త ఎల్లవరంలో పల్లె నిద్ర



కొత్త ఎల్లవరంలో పల్లె నిద్ర చేస్తున్న సీఐ హరి, ఎస్ఐ కృష్ణారావు

గొలుగొండ: ప్రజలు శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని నర్సీపట్నం రూరల్ సీఐ బి. హరి, గొలుగొండ ఎస్ఐ బి. కృష్ణారావు తెలిపారు. సోమవారం రాత్రి కొత్త ఎల్లవరంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో రాజ్యాంగం కల్పించిన హక్కులకు ఎటువంటి భంగం కలగకుండా చూడాలని తెలిపారు. ఎటువంటి తగాదాలకు పాల్పడొద్దన్నారు. రాత్రికి అక్కడే పల్లె నిద్ర చేశారు.

కూలిన చింతచెట్టు

మాడుగుల రూరల్: ఎం.కోటపాడు పాచిల వారి కళ్లాల సమీపంలో మంగళవారం మధ్యాహ్నం ఆర్‌అండ్‌బీ రోడ్డుపై చింతచెట్టు కూలిపోయింది. దీంతో రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వడ్డాది, పాడేరు, మాడుగుల మధ్య వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్కు ఇన్‌స్పెక్టరు పి.దేముడునాయుడు, తన సిబ్బంది కలిసి యుద్ధప్రాతిపదికన చెట్టును తొలగించారు.

ఘనంగా పోలిపల్లమ్మ తీర్థం, గంగాదేవి గావు పండగ



మేడిచర్లలో పోలిపిల్లమ్మను దర్శించుకున్న డిప్యూటీ సీఎం బూడి

కె.కోటపాడు: మేడిచర్లలో పోలిపల్లమ్మ అమ్మవారి తీర్థం, కె.జె.పురంలో గంగాదేవి గావు పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ రెండు గ్రామాల్లో అమ్మవార్లను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆదిరెడ్డి వెంకటరావు, రైవాడ ప్రాజెక్ట్ మాజీ చైర్మన్ బొడ్డు తాతయ్యబాబు, ఎంపీటీసీ చీపురుపల్లి అచ్చిబాబు, యడ్ల దేముళ్లు, చీపురుపల్లి గోవింద పాల్గొన్నారు.

800 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

కె.కోటపాడు: సూర్రెడ్డిపాలెం శివారులో సారా తయారీ కేంద్రాలపై ఎ.కోడూరు పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. సూర్రెడ్డిపాలెం –మేడిచర్ల గ్రామాల సరిహద్దులో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన డ్రమ్ములు, పాత్రలలో 800 లీటర్ల బెల్లం పులుపును వీరు గుర్తించారు. సిబ్బంది సహాయంతో ఎస్ఐ జె.రమేష్ ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఏఎస్ఐ.రెహమాన్, సింహాచలం నాయుడు, ప్రసాద్, సన్నిబాబు పాల్గొన్నారు.

అక్రమ మద్యంతో ఒకరి అరెస్టు

చోడవరం రూరల్: లక్కవరంలో అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన వ్యక్తిని అరెస్టు చేశామని ఎస్ఐ శేఖరం మంగళవారం తెలిపారు. సమాచారం మేరకు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ మురుకుతి చినబాబు(35) ఇంట్లో సోదాలు చేయగా, 180 ఎంఎల్ మద్యం సీసాలు 20 లభ్యమైనట్టు చెప్పారు. వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

సారా, మద్యం స్వాధీనం

- ఇద్దరిపై కేసు నమోదు

గొలుగొండ: జోగుంపేటలో సారా తరలిస్తున్న నమ్మాది శ్రీనువాస్‌ను అరెస్టు చేసి కోర్టుకు తరలించామని ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. అతడి నుంచి ఐదు లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎర్రవరం గ్రామానికి చెందిన వెంకటరమణ 11 లిక్కర్ బాటిళ్లు తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు. ఇప్పటి వరకు గొలుగొండ పీఎస్‌లో 20 రోజుల్లో 26 కేసులు, కృష్ణదేవిపేట పీఎస్‌లో 21 కేసులు, గొలుగొండ ఎస్ఈబీ ఎస్ఐ రహీమ్ ఆధ్వర్యంలో 28 కేసులు నమోదు చేశారు.

బూడి, అనురాధ ఎంపికపై హర్షం



ముత్యాలనాయుడు సమక్షంలో ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధను సన్మానిస్తున్న నాయకులు

మాడుగుల/దేవరాపల్లి: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈర్లె అనురాధ ఎంపికపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. మంగళవారం మాడుగుల ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బొడ్డపు దేవునాయుడు నాయకులు కాత రమణ, పద్రే రామునాయుడు తారువలో వారికి దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి ముత్యాలనాయుడు, అనురాధ స్థానిక మర్లతల్లి ఆలయంలో పూజలు చేశారు. వీరికి జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా సంయుక్త కార్యదర్శి రొంగలి నారాయణమ్మ, మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, కర్రి సూరినాయుడు, వైస్ ఎంపీపీ ఉగ్రూకుల గంగాభవానీ, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి, కొప్పుల వెలమ, గవర కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, దాడి జగన్ శుభాకాంక్షలు తెలిపారు.

కె.కోటపాడు/మాడుగుల రూరల్: ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా ముత్యాలనాయుడు, అనురాధలను ఎంపిక చేయడం ఆనందదాయకమని సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, కె.కోటపాడు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు అన్నారు. వైస్ ఎంపీపీలు రొంగలి సూర్యనారాయణ, లెక్కల నాగ విజయలక్ష్మి, మాడుగుల ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హర్షం వ్యక్తం చేశారు.

అడుగడుగునా నీరాజనం



విప్ ధర్మశ్రీని సత్కరిస్తున్న వ్యాపారులు

- చోడవరం పట్టణంలో ధర్మశ్రీ ఎన్నికల ప్రచారం
- రూ.14 కోట్లతో మంచినీటి సమస్య పరిష్కరించాం
- రెండో రోజు ప్రచారంలో వ్యాపారుల మద్దతు



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పార్టీ నాయకులు, అభిమానులు

చోడవరం: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఎన్నికల ప్రచారానికి అడుగడుగునా జన నీరాజనం పలికారు. అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తూ.. ముందుకు సాగిన ఆయనకు ఘన స్వాగతం పలికారు. అభిమానుల కోలాహలం మధ్య సాగిన ఈ ప్రచారం చోడవరం పట్టణంలో పెదబజార్, అన్నవరం ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించారు. తొలుత ఇక్కడి కన్యాకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి రెండో రోజు ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. పట్టణంలో అన్ని వార్డులకు చెందిన ముఖ్య నాయకులతోపాటు కార్యకర్తలంతా తరలివచ్చారు. మేళతాళాలతోపాటు జనసందోహం మధ్య కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి ప్రారంభించిన ప్రచారం పెదబజార్, బంగారం షాపుల జంక్షన్ మీదుగా చినబజార్, అన్నవరం ప్రాంతాల్లో నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి అక్కా.. చెల్లి, అమ్మా.. తమ్ముడు, అన్నా.. అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి, రైతులను ఆదుకునే అనేక పథకాలు ప్రవేశపెట్టారని ధర్మశ్రీ అన్నారు. ప్రతీ ఇంటికి ప్రభుత్వం ఎంతో కొంత మేలు చేసిందన్నారు. చోడవరం పట్టణంలో అన్ని వార్డుల అభివృద్ధికి ఎంతో కృషి చేశామన్నారు. రూ.14 కోట్లతో ఖర్చు చేసి మంచినీటి సమస్యను పరిష్కరించామన్నారు. పేదలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. డ్వాక్రా అక్కాచెల్లెమ్మలకు ఆసరా, సున్నావడ్డీ, చేయూత వంటి పథకాలందించి ఆర్థికాభివృద్ధి చెందడానికి ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. తమ ఇంటికి వచ్చిన ధర్మశ్రీకి మహిళలు హారతులతో నీరాజనం పలికారు. జై జగన్...జై ధర్మశ్రీ అంటూ పార్టీ కార్యకర్తలు, మహిళలు నినాదాలు చేశారు. ఈ ప్రచారంలో పార్టీ పట్టణాధ్యక్షుడు దేవరపల్లి సత్య, పంచాయతీ ఉప సర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు బొగ్గు శ్యామల, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, మండలాధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు పసుమర్తి గుప్తా, వార్డు మెంబర్లు పసుమర్తి సంతోష్, గూనూరు రాజు, పట్టణాధ్యక్షురాలు యర్రా దేవి, జిల్లా మహిళా విభాగం కార్యదర్శి అల్లాడ భవానీ, మండల యూత్ అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి పందిరి శ్రీనివాసరావు, వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భ్రూణ హత్యకు పాల్పడితే కఠిన చర్యలు

చోడవరం రూరల్: గర్భస్థ శిశువు ఆడపిల్లగా నిర్ధారణ చేసుకుని చిదిమేస్తే(అబార్షన్) కఠిన చర్యలు తప్పవని రావికమతం ఐసీడీఎస్ పీవో జి.ఉషారాణి హెచ్చరించారు. మంగళవారం గవరవరం పీహెచ్‌సీలో బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. స్త్రీశిశు సంరక్షణ, బాల్య వివాహాల అనర్థాలపై ఆమె వివరించారు. అసిస్టెంట్ పీవో ఎస్.పుష్పాదేవి, సూపర్‌వైజర్లు డి.శ్రీదేవి, ఎస్.అనిత పాల్గొన్నారు.

కె.కోటపాడు: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ పీవో మంగతాయారు తెలిపారు. బేటీ బచావో... బేటీ పడావోలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్లు రాములమ్మ, సుశీల పాల్గొన్నారు.